సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మెదక్ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ యమున



మాట్లాడుతున్న ఎంపీపీ యమున

మెదక్ రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ యమునజయరాంరెడ్డి అన్నారు. శనివారం మెదక్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యమున అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికను వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించినప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఎంపీటీసీ శ్రీహరి మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం బాగాలేనప్పుడు పట్టించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, పశు వైద్యాధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని సంబంధిత అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ ఆంజనేయులు మాట్లాడుతూ.. రాయిన్‌పల్లి ప్రాజెక్టు నుంచి కోంటూరు వరకు ఉన్న కాలువలో పిచ్చి మొక్కలు పెరిగి నీటి పారుదలకు ఇబ్బందిగా మారిందని, వాటిని తొలగించాలని తెలిపారు. ఎంపీటీసీ ప్రభాకర్ మాట్లాడుతూ.. అవసరమైన చోట చెరువుల తూం మరమ్మతులను చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీరాములు, వైస్ ఎంపీపీ మార్గం అంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం


కొల్చారం(నర్సాపూర్): మాట్లాడుతున్న ఎంఈఓ

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులు చదువుల్లో రాణించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం చాలా అవసరమని ఎంఈఓ నీలకంఠం అన్నారు. శనివారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులను సెల్‌ఫోన్, టీవీ, ఫంక్షన్‌లకు దూరంగా ఉంచాలని సూచించారు. పిల్లలపై ఒత్తిడి పెంచకుండా చదువుపై ఏకాగ్రత పెంచేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ యాదగిరి, కో ఆప్షన్ మెంబర్ రాంకిషన్ తదితరులు ఉన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం పోషకుల(తల్లిదండ్రుల) సమావేశాన్ని ఉపాధిహామీ పనుల వద్ద నిర్వహించారు. పనులకు వెళ్లిన పోషకులు ఎవరు పాఠశాలలో నిర్వహించే సమావేశానికి రాకపోవడంతో ఉపాధ్యాయులే ఉపాధి పనుల వద్దకు వెళ్లి సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. పాఠశాల విద్యార్థులను విధిగా పంపాలని, ఒంటిపూట బడులకు సమయానికి పంపాలన్నారు. పదోతరగతి విద్యార్థులను ఉదయమే నిద్రలేపి చదివించాలన్నారు. పాఠశాలల్లో నిర్వహించే ప్రతీ సమావేశానికి హాజరు కావాలని అన్నారు. తమ పిల్లలపై, పాఠశాలపై తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించొద్దని ఉన్నత పాఠశాల హెచ్ఎం గోవర్ధన్‌రాథోడ్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దుర్గయ్య సూచించారు. ఇందులో ఉపాధ్యాయులు సుధారాణి, మల్లీశ్వరీ, మహేశ్, శ్రీనివాస్, సమీర్, లక్ష్మీకాంత్, ప్రశాంత్, కృష్ణ, గౌతమి, కావ్య, మల్లేశంగౌడ్, మొగులయ్య తదితరులు ఉన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి


మాట్లాడుతున్న హెచ్ఎం శ్రీనివాస్

మెదక్ రూరల్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని హెచ్ఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం హవేళిఘనాపూర్ మండలంలోని కూచన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతీరోజు పాఠశాలకు హాజరయ్యేలా చొరవ చూపాలన్నారు. పరీక్షల సమయం కావడంతో ఇంటి వద్ద టీవీలు, ఫోన్‌లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు లింగం, విజయ్‌కుమార్, వనజాక్షి, జాకీర్‌హుస్సేన్, లక్ష్మీకాంతం, స్టెల్లా, ప్రభుతో పాటు పోషకులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ


హోమం చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లిలో శీతలామాత సహిత రేణుకా ఎల్లమ్మదేవి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ పూజలు శనివారం ఘనంగా జరిగాయి. గ్రామ పురోహితులు రాజమౌళిశర్మ, మెట్టురాములుశర్మ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాత ఎన్ఆర్ఐ బాల కిషన్‌రావు, తిరుపతిరావు, హిమాద్రిరావు హోమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆలయం వద్ద దేవతా ఆహ్వానం, మూలమంత్ర హవనం, రుద్ర, చండీహవనం, దేవతామూర్తుల ధాన్యధివాసం, పుష్పాధివాస, ఫలాధివాస, శయ్యాధివాసములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, పోచయ్య, నర్సింలు, కృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వడ్డీ రుణ పత్రాల పంపిణీ


రుణ పత్రాలను అందిస్తున్న సర్పంచ్ మల్లేశ్


చేగుంట(తూప్రాన్): చెక్కును అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్, తుపాకులపల్లి గ్రామాల్లో శనివారం మహిళల సమైఖ్య సంఘాల వారికి రుణాలకు సంబంధించి వడ్డీ చెల్లింపు పత్రాలను అందజేశారు. కాళ్ళకల్ గ్రామంలోని 81 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ. 33లక్షల 73వేలు 379ల విలువైన పత్రాలను గ్రామ సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ లావణ్య అందజేశారు. తుపాకులపల్లిలో ఉప సర్పంచ్ కాంతమ్మ నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు కోమురయ్య, మహేశ్, మహిళలు తీసుకున్న రుణాలను ప్రతీ నెల సక్రమంగా చెల్లించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు కృష్ణవేణి, శోభరాణి, మహిళలు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని 766 మహిళా సంఘాలకు మంజూరైన రెండుకోట్ల 38 లక్షల రూపాయలకు సంబంధించిన చెక్కును ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం లక్ష్మినర్సమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి సునీత, సీసీలు శ్వేత, స్వామి, రామస్వామి, అంజయ్య ఆయా గ్రామాలకు చెందిన మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


కౌడిపల్లి(నర్సాపూర్): పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్‌లో సీసీరోడ్డు పనులను సర్పంచ్ కురుమ శేఖులు శనివారం ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం నిధులు రూ. 30లక్షలు మంజూరు కావడంతో గ్రామంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. దీంతో కాలనీల్లో సమస్య తీరనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యుడు సత్యనారాయణ, తునికి నల్లపోచమ్మ ఆలయ ధర్మకర్త సంతోష్‌కుమార్, మాజీ సర్పంచ్ నాగభూషణం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థికసాయం అందజేత**

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు శనివారం దాతలు ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన గంపల్లి సిద్దిరాములు శనివారం మృతి చెందాడు. దీంతో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేలను అందజేశారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బన్ని రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా ఎంపీపీ కల్లూరి హరి కృష్ణ బాధితుడికి చికిత్స కోసం రూ.5 వేలు పంపించగా సర్పంచ్ అనూష అందజేశారు.

◆ **రేపు టేక్మాల్ మార్కెట్ వేలంపాట**

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్‌లో ప్రతీ శనివారం నిర్వహించే వారంతపు సంతను ఈనెల 20(సోమవారం)న వేలం వేయనున్నట్లు ఈఓ రాకేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం వేసే రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు కూరగాయలు, మేకల సంతకు సంబంధించిన డిపాజిట్లను స్వీకరించి, మధ్యాహ్న సమయంలో వేలం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనేందుకు డిపాజిట్‌లు చేసి పొందాలని సూచించారు.

◆ **కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రచారయాత్ర**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రైతు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆటోజాత ప్రచారయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ మాట్లాడుతూ.. కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. ఉపాధి కూలీలను తగ్గించడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, మండల కన్వీనర్ నీలంబాబు, ఇతర నాయకులు పంజా ఎల్లం, నర్సింలు, ప్రశాంత్, ఎల్లస్వామి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

◆ **సీసీరోడ్డు పనులు ప్రారంభం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని జగ్గంపేట గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ మాంతప్ప శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పోచమయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

◆ **పరీక్ష సామగ్రి అందజేత**

మెదక్ రూరల్: హవేళిఘనాపూర్ మండలంలోని రాజ్‌పేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ఎంపీటీసీ దుర్గారావు పరీక్ష సామగ్రి అందజేశారు.

◆ **ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడిగా రాంకుమార్**



రామాయంపేట(మెదక్): రామాయంపేట, నిజాంపేట మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు శనివారం స్థానిక వివేకానంద విద్యాలయంలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా మోహన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూళ్ల యాజమానులు జితేందర్‌రెడ్డి, నర్సింలు, అజ్మోస్, శ్యామ్, వెంకటేశ్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇవేం 'ఉపాధి' పనులు

- చెరువులో తవ్వి అక్కడే మట్టిని పోస్తున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ కరువు


కాయిదంపల్లి చెరువులో మట్టిని తవ్వి అక్కడే వేసిన దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. ఫీల్డ్ అసిస్టెంట్‌ల అవగాహన లోపం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టరాజ్యంగా పనులు చేయడం వల్ల ఉపాధిహామీ నిధులు వృథా అవుతున్నాయి. చెరువులో మట్టి తవ్వి, తవ్విన మట్టిని పక్కనే వేస్తున్నారు. చెరువులో మట్టి పనులు చేపడుతున్నా.. అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. కూలీలు చేసిన పనులు పనికిరాకుండా పోవడమే కాకుండా చెరువులో మట్టి చెరువు పాలే అవుతోంది. చెరువులో మట్టి పనులు చేస్తే కట్టపైన ఎత్తు పెరగడానికి, రైతుల పొలాల్లో మట్టి వేసుకోవాలి. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఉపాధి నిధులు వృథా అవుతున్నాయి. ఈ సంఘటన అల్లాదుర్గం మండలంలో చోటు చేసుకుంది.

- అల్లాదుర్గం మండలంలోని ఎల్లమ్మ చెరువులో ఉపాధి హామీ పనులు ఇష్టరాజ్యంగా చేపడుతున్నారు. చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టి, మట్టిని రైతుల పొలాల్లో వేయాలి. చెరువులో మట్టిని తవ్వి చెరువు కట్టపై వేయాలి. అల్లాదుర్గం, గడిపెద్దాపూర్, కాయిదంపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు పక్కదారి పట్టి నిధులు వృథా అయ్యాయనే ఆరోపణలున్నాయి.
- కాయిదంపల్లి సిద్రమకుంటలో 200 మంది కూలీలతో మూడు వారాలు ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఈ పనులకు ఉపాధి హామీ పథకం కింద కూలీలు లక్ష 63 వేలు చెల్లించారు. చెరువులో పూడికతీత పనులు చేపట్టారు. చెరువులో మట్టి తవ్వి రైతుల పొలాల్లో, లేక చెరువు కట్టపై వేయాల్సి ఉండగా అక్కడే తవ్వి అక్కడే మట్టి పోశారు. దీంతో ఈ పనులతో ఎవరికి ఉపయోగం, ఎందుకు చేపట్టినట్లని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. పనులు చేస్తే పర్యవేక్షించాల్సిన టెక్నికల్ అసిస్టెంట్‌లు గుడ్డిగా రికార్డులు చేయడమే కాక ఉపాధిహామీ పథకాన్నే పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలున్నాయి.
- ఎల్లమ్మ చెరువులో 150 మంది కూలీలతో రెండు వారాలుగా మట్టి తవ్వే పనులు చేపట్టారు. ఈ చెరువులో ఏటా ఇవే పనులు ఇదే విధంగా చేపడుతున్నారు. ఐదేళ్లుగా ఎల్లమ్మ చెరువులో మట్టి పనులు చేస్తునే ఉన్నారు. చెరువులో నీళ్లు ఉండటంతో చివరలో అనవసరమైన చోట మట్టి తవ్వి అక్కడే అక్కడే వేయడం గమనార్హం.
- గడిపెద్దాపూర్ పటన్‌చెరువులో 60 మంది కూలీలతో రెండు వారాలు పనులు చేపట్టారు. ఈ పనులకు రూ.50 వేల వరకు కూలీ డబ్బులు చెల్లించారు. ఈ చెరువులో జేసీబీతో తవ్వినట్లు తెలుస్తోంది. జేసీబీ పనులకు ఉపాధిహామీ కింద రికార్డులు చేసినట్లు ఆరోపణలున్నాయి.
- ఈవిషయంపై టీఏ సాయికుమార్‌ను వివరణ కోరగా.. చెరువులో మట్టి సర్పంచ్ పల్లె ప్రకృతి వనంలో వేస్తామని చెప్పారని తెలిపారు. తొందరలోనే మట్టి తరలిస్తామన్నారు. మట్టి తరలించే పనికి మళ్లీ ఎలా రికార్డు చేస్తారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా దాటవేశారు.
- కాయిదంపల్లి సర్పంచ్ బేతయ్యను వివరణ కోరగా.. ఉపాధి పనులకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. చెరువులో మట్టి ఎందుకు ఉంచారని తానే టీఏను ప్రశ్నించినట్లు చెప్పడం గమనార్హం.


అల్లాదుర్గం ఎల్లమ్మ చెరువులో తవ్విన మట్టిని అక్కడే వేసిన దృశ్యం

ప్రతీ వాహనానికి ధ్రువపత్రాలు ఉండాలి

అల్లాదుర్గం సీఐ జార్జ్


ఎల్లంపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ జార్జ్

టేక్మాల్(మెదక్): ప్రతీ వాహనానికి తప్పనిసరిగా ధ్రువపత్రాలు ఉండాలని అల్లాదుర్గం సీఐ జార్జ్ అన్నారు. శనివారం మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో ఎస్పీ రోహిణీ ప్రియదర్శిణి ఆదేశాల మేరకు పోలీసుల కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి వాహనాలను తనిఖీ చేయగా, 35 కాగితాలు లేని వాహనాలను పట్టుకొని, అవగాహన కల్పించి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... రోడ్డుమీద ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలను గురికావొద్దని, ఓటీపీ వచ్చింది చెప్పండంటూ ఎవరు ఫోన్ చేసినా స్పందించవద్దన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు ఎవరు తిరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇందులో ఎస్ఐ లింగం, రేగోడ్ ఎస్ఐ సత్యనారాయణ, పెద్దశంకరంపేట ఎస్ఐ బాల్‌రాజ్, ఏఎస్ఐ దయానంద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్రలో మెదక్ నాయకులు


రేవంత్‌రెడ్డితో మెదక్ నేతలు

మెదక్‌జోన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర శనివారం కామారెడ్డికి చేరుకుంది. కాగా మెదక్ చెందిన పలువురు కాంగ్రెస్ శ్రేణులు రేవంత్‌రెడ్డితో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఆయనను కలిసిన వారిలో పీసీసీ ప్రతినిధులు చౌదరి సుప్రభాత్ రావు, మ్యాడం బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో చిన్నశంకరంపేట మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. శనివారం కామారెడ్డిలో నిర్వహించిన జోడో పాదయాత్రలో పాల్గొన్న చిన్నశంకరంపేట వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీలు ప్రసాద్‌గౌడ్, శివకుమార్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి రేవంత్‌రెడ్డితో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.

పంటకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న బాల్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పంటలకు సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి బాల్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఫైజాబాద్‌లో వరి, ఇతర పంటలకు సోకుతున్న వ్యాధులు, వాడాల్సిన మందులపై రైతులకు శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు


నిజాంపేట(మెదక్): చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీటీసీ లహరి


చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో..

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. గ్రామంలోని నాలుగు, ఐదో కేంద్రంలో సామూహిక సీమంతాలతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లహరిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, దుర్గేశ్వరి, ఆయాలు రాజేశ్వరి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజిరెడ్డి, ఉపసర్పంచ్ జీవన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల, అంగన్‌వాడీ కార్యకర్తలు మాలతి, రేణుక, నాగరాణి, నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

ప్రమాదంగా విద్యుత్ తీగలు


చిల్వెర చౌరస్తాలో విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలు

అల్లాదుర్గం(మెదక్): వేసవి కాలంలో గాలి దుమారం విస్తుండటంతో విద్యుత్ తీగలు తెగిపడుతూ ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. చెట్ల కొమ్మలకు విద్యుత్ తీగలు తాకుతుంటే ఎప్పుడు ఎం జరుగుతుందోనని, విద్యుత్ అంతరాయంతో చిల్వెర ఐబీ చౌరస్తాలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దలైన్‌తో పాటు వినియోగదారులకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే తీగలు చెట్ల కొమ్మలకు తాకుతున్నాయి. ఐబీ చౌరస్తా నుంచి వట్‌పల్లి వైపు వెళ్లే రహదారి పక్కన విద్యుత్ వైర్లు చెట్ల కొమ్మల మధ్య నుంచి ఉన్నాయి. దీంతో గాలి ఎక్కువ విస్తున్నప్పుడు తీగలు తెగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, చెట్ల కొమ్మలు నరికి వేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

శబరిమలలో ఎమ్మెల్యే పూజలు


ఆలయం వద్ద ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, తదితరులు

నర్సాపూర్: నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శబరిమలకు వెళ్లి శనివారం అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్‌లో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి కావాలని స్వామిని మొక్కుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వెంట రాష్ట్ర హైకోర్టు పీపీ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఓల సంఘం అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, న్యాయవాదులు అంజిరెడ్డి, మనోహర్‌లతో పాటు నర్సాపూర్‌కు చెందిన కరుణాకర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్ ఉన్నారు.

సామూహిక మహాలింగార్చన


పూజలు చేస్తున్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలోని శివాలయంలో శనివారం వార్షికోత్సవ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామివారికి జలాభిషేకం, అర్చన, బిల్వ పత్రాల పుష్పాలతో ప్రత్యేక పూజలు, సామూహిక మహాలింగార్చన చేశారు. పూజా మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డీఈ, ఎంపీపీ

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండల పరిధిలోని ఇసుకపాయల తండాలో వేస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం పీఆర్‌డీఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రైబల్ ఎస్డీఎఫ్ నిధులతో రూ. 35 లక్షలతో ఇసుకపాయల తండాలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. అన్ని గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు తొందరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల రైతు బంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దంపతులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పరీక్షలపై అవగాహన


మాట్లాడుతున్న ఉదయ్‌రంజన్‌గౌడ్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంకు చెందిన యువకుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయ్‌రంజన్‌గౌడ్ శనివారం కాళ్ళకల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

సీబీఐ విచారణ చేపట్టాలి

నర్సాపూర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ల లీకేజీ ఘటనను సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర హోళియదాసరి కులసంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రద్దు చేయాలని, పేపర్ల లీకేజీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.